ఓం నమో భగవతే శ్రీరమణాయ

# రమణ భాస్కర

## (జిన్నూరులో శ్రీనాన్నగారి ప్రవచనము, 23-9-95)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

దేహము యొక్క పుట్టుకకు, మరణముకు అంత ప్రాధాన్యతలేదు. ఎందుచేతనంటే దేహంపుట్టినపుడు మనం పుట్టలేదు. దేహం మరణించినపుడు మనం మరణించటం లేదు. సత్యవస్తువు గురించి తెలిసేవరకూ, ఉన్నవస్తువు ఉన్నట్లుగా మనకు అనుభవంలోనికి వచ్చేవరకూ ఈ పుట్టుక, చావు నిజం వలె మనకు కనబడతాయి. కృష్ణుడు కూడా మధురలో జన్మించినపుడు నేను పుట్టాను అని చెప్పలేదు. నేను జన్మించిన వానివలె కనబడుతున్నాను అనిచెప్పాడు. బ్రహ్మము పుట్టదు. శరీరము పుడుతుంది, శరీరము పెరుగుతుంది, శరీరము మరణిస్తుంది. శరీరము మరణించేటప్పుడు మనకు భయం కలుగుతుంది. భయంకలగటానికి కారణము వ్యక్తి భావన. వ్యక్తి భావన లేకపోతే భయం కలుగదు. వ్యక్తి భావన పునర్జన్మకు కారణం. మరణం అంటే ఎవడైతే భయపడుతున్నాడో వాడు తప్పకతిరిగి జన్మిస్తాడు.

రాగము, భయము, కోపము వీటిని ఉపనిషత్తులలో హృదయ గ్రంధులు అనిచెపుతారు. ఈ హృదయ గ్రంధులు తెగితేనేగాని పునర్జన్మలేని స్థితికి ఎదగలేడు అంటే వెలుగులోనికి ప్రవేశించలేడు అని చెపుతారు.

ఇంద్రియాలకు సంబంధించిన గొడవలు, బుద్ధికి సంబంధించిన గొడవలు ఇవి అన్నీ కూడా ఒక అడవి. గురువు సహాయం లేకుండా కేవలము మన తెలివి తేటలవలన ఈ అడవి నుండి బయటపడలేము. ఇంద్రియాలు కల్పించే విషయములనుండి మానవుడు బయట పడటం చాలాకష్టం. తెలివి మనకు అవసరమేగాని తెలివి తేటలు మనంకాదు. ఎందుకంటే గాఢనిద్రలో మనం తెలివితేటల నుండికూడా విడిపోతున్నాము.

మనకు జీవలక్షణాలు ఉన్నాయా, దేవునికి ఉండే లక్షణాలు ఉన్నాయా అంటే మనకు జీవలక్షణాలే కనిపిస్తున్నాయి. ప్రతీవాడు నేను ధనవంతుడను లేక నేను పేదవాడిని, నేను విద్యావంతుడను లేక నేను విద్యా వంతుడనుకాదు అని ఇలా ఏదో ఒకటి అనుకొంటూ ఉంటాడు. వాడుజీవుడు. జీవుడు ఏదో ఒకటి అనుకొంటూ ఉంటాడు. దేవుడు ఏమీ అనుకోడు. జీవలక్షణాల నుండి విడుదలపొందాలంటే గురువు అనుగ్రహము అవసరము. జీవలక్షణాలు చాలా బలీయమైనవి. మనం ఎంత సాధన చేసినా మన సాధనాబలం కంటే జీవలక్షణాల బలం ఎక్కువ. అందువలన గురువు అనుగ్రహము వాటిని పడగొట్టాలి గాని కేవలము మన సాధనాబలం సరిపోదు. అలాగని సాధన అవసరము లేదు అని కాదు సాధన అవసరమే.

మన బంధువులతోటి, స్నేహితులతోటి, పరిసరాల తోటి మనకు ఉన్నసంబంధము శరీరము మరణించినపుడు తెగిపోతుంది. సంబంధము తెగనిది ఒక్క గురువుతో మాత్రమే. ఎందుచేత నంటే గురువు అంటే దేహము కాదు. గురువు అంటే దేహము కాదు కాబట్టి గురువు దేహము మరణించినప్పటికీ మనకు ఆయనతో ఉన్న సంబంధము అలాగే కొనసాగుతుంది. మన బంధువులలాగ, స్నేహితులలాగ గురువు కూడా

దేహమే అయితే దేహం మరణించినపుడు ఈ దేహయాత్రతో గురువుతో సంబంధము కూడా తెగిపోతుంది. కాని గురువుతో సంబంధము తెగదు ఎందుకంటే గురువు అంటే దేహము కాదు. గురువు అంటే ఆత్మ. అది మన హృదయంలోనే ఉంది. రమణస్వామి చెప్పినది హృదయవిద్య.

దేహమునకు రంగు ఉంటుంది. మనస్సుకు గుణం ఉంటుంది. దేవునికి రంగులేదు, గుణంలేదు. అందువలన ఆయన మనకు తెలియటంలేదు. రంగు, గుణము ఉంటే పట్టుకొనేవారము. ఆయనకు ఇవి రెండూలేవు. ప్రపంచములో దేనితోనూ పోల్చదగిన వాడుకాదు భగవంతుడు. అందువలన ఆయనను పట్టుకోలేక పోతున్నాము. భగవంతుడు అందరి హృదయములలో స్థిరంగా ఉన్నాడు, ఆత్మరూపంగా ఉన్నాడు, చైతన్య రూపంగా ఉన్నాడు, శాంతిగా ఉన్నాడు, కాంతిగా ఉన్నాడు. ఆయన మనకు అత్యంత సన్నిహితంగా ఉన్నా మనకు అనుభవంలోనికి రాకపోవటానికి కారణం భగవంతుడుకాదు. మన బుద్ధిలో ఉన్న దోషములే కారణము. అలవాట్ల వేగము, తలంపుల వేగము వలన ఆయన మనకు తెలియటంలేదు.

జీవకోటి కంతకూ ఆదిని నేనే. నేను లేకపోతే సృష్టిలేదు. సృష్టి లేకపోయినా నేను ఉండగలను. సృష్టికంతకు ఆధారము పరమేశ్వరుడే. ఆయనకు పురుషోత్తముడు అని పేరు. సృష్టిలో అనేక దేహములు ఉన్నాయి. అంటే అనేక పురములు ఉన్నాయి. అన్ని పురములలోనూ అంటే అన్ని ఉపాధులలోనూ అంతర్యామిగా ఉంటూ వారి వారి కర్మానుసారము వారిని నడిపిస్తున్నాడు. వాడు పురుషోత్తముడు.

నేను అనేది ఒక తలంపు. అది ఒక భావన. అది నిజంకాదు. ఎందుచేతనంటే గాఢనిద్రలో నేను అనే తలంపుకూడా మన నుండి విడిపోతోంది. కాలం రూపములో ఉన్నది నేనే అని పరమేశ్వరుడు చెప్పాడు కాబట్టి కాలమును సద్వినియోగము చేసుకొంటూ నేను అనే తలంపును విచారణచెయ్యాలి. ఇది ఎక్కడ నుండి వస్తోంది, దీని కేంద్రం ఏమిటి అని నేనును విచారణ చేస్తూ ఉంటే పుణ్యం వస్తుంది, జ్ఞానం మాట అటు ఉంచండి. యజ్ఞయాగాలు చేస్తేగాని పుణ్యం రాదు అని అనుకొంటాము కాని నేనును విచారణ చేసినా పుణ్యం వస్తుంది నీవు పుణ్యం కావాలని అనుకొంటే. మనం తిన్నది అంతా అశుద్ధం క్రింద తయారవుతుంది, కాని మనం ఇతరులకు పెట్టినది పుణ్యం క్రింద, కీర్తి క్రింద మారుతుంది అని షిరిడీ బాబా గారు చెప్పారు.

జ్ఞానము, దేవుడు, బ్రహ్మానుభవం మాట అటు ఉంచండి. మనకు ఎంతో కొంత ఓర్పు, సహనము, త్యాగము లేక పోతే సభ్యతరాదు. సభ్యత ఉన్నవాడి మనస్సు అంతర్ముఖం అవుతుంది గాని సభ్యత లేనివాడి మనస్సు అంతర్ముఖం అవ్వదు. మనస్సు మధ్యలో ఉంది. అది బాహ్యముఖానికి వెళితే ప్రపంచము అవుతుంది. అంతర్ముఖానికి వెళితే ఆత్మ అవుతుంది. మనం బాగుపడేదీ మన చేతులలోనే ఉంది. మనం చెడిపోయేదీ మన చేతులలోనే ఉంది.

మనకు మనస్సే నేనుగా వ్యక్త మవుతోంది. అది లోపల నుండి వస్తోంది. నేనుకు ఒక కేంద్రం ఉంది. అదే హృదయము. నేనును దాని కేంద్రంలోనికి పంపాలి. గాడ నిద్రలో మనకు తెలియకుండా అది దాని కేంద్రంలోనికి వెళ్ళి పోతుంది. జాగ్రదావస్థలో ఎరుకతో దానిని కేంద్రంలోనికి పంపాలి. నేను అనే తలంపును దాని కేంద్ర మైన హృదయంలోనికి ఉపసంహరించుకోగలిగితే అక్కడ దేవుడు ఉన్నాడు దేవుని చూసిన వెంటనే అది నశిస్తుంది నీవు మిగులుతావు అంటున్నారు భగవాన్. అక్కడ శాంతి ఉంది, కాంతి ఉంది. అక్కడ ఉన్న శాంతిని పొందినపుడు నీవు ఇతరుల గురించి ఫిర్యాదులు చేయవు. రోజూ మనకు ఇతరుల గురించి

ఫిర్యాదులు చేయటం అలవాటు. సంస్కరించుకొనే బుద్ధి తక్కువ. ఇతరుల గురించి ఫిర్యాదులు చేస్తూ ఉంటే మనలో ఉన్న శాంతి మనకు దొరకలేదు అని అర్థం.

నదిలోని నీరు సముద్రంలో కలుస్తుంది. నది సముద్రంలో కలిసినపుడు దాని పేరును పోగొట్టుకొంటుంది, దాని రూపమును పోగొట్టుకొంటుంది. దాని పేరును, రూపమును పోగొట్టుకొంటేగాని అది సముద్రంలో కలవలేదు. సముద్రంలో కలిసిన వెంటనే దాని పేరునుండి, రూపం నుండి విడిపోతుంది. అలాగే ఎవడైతే తన పేరు నుండి, రూపము నుండి విడిపోతున్నాడో వాడికి బ్రహ్మానుభవం కలుగుతుంది. వ్యక్తి భావన ఉన్నవాడు తన పేరులోనుండి, రూపములో నుండి విడిపోలేడు. వ్యక్తి భావన ఉన్న వాడిని రాగము, భయము, క్రోధము ఇవి మూడూ విడిచిపెట్టవు. వీటిని ఉపనిషత్తులలో హృదయగ్రంథులు అన్నారు. అవి తెగిపోతేనే గాని వస్తువు అనుభవంలోనికి రాదు.

భగవంతునికి గుణములు లేవు. గుణములు లేని వస్తువును Direct గా మనం పట్టుకోలేము. అందువలన మంచి గుణాలతో ఈశ్వరుని ఆరాధించటం ప్రారంభిస్తే మనకు ఉపాసన కుదురుతుంది, ఆయన తేలికగా పట్టుబడతాడు.

మీరు పీల్చుకొనే గాలి దేవుడు, త్రాగే నీరు దేవుడు, నిప్పుదేవుడు, ఆకాశము దేవుడు, చంద్రుడు దేవుడు, సూర్యుడు దేవుడు, మట్టిదేవుడు అన్నారు భగవాన్. ఇలాదేనిని చూసినా (అంటే గాలిని చూసినా, నీరును చూసినా, ఆకాశమును చూసినా) అది దేవుడే అనే భావన కలిగితే నీ మనస్సు పరిశుద్ధం అవుతుంది, పవిత్రం అవుతుంది, ఏకాగ్రత వస్తుంది. తొందరగా మనస్సు పరిపక్వం అవ్వటం కోసం, ధ్యానం బాగా కుదరటం కోసం గాలిదేవుడు, నిప్పుదేవుడు, ఆకాశము దేవుడు నీవు కూడా దేవుడే నీవు జీవుడవు అనుకొంటున్నావు కాని నీవు కూడా దేవుడే అంటున్నారు భగవాన్. తెలియకపోతే జీవుడు. తెలుసుకుంటే దేవుడు. సృష్టిలో అనేక రకముల మనుషులు ఉంటారు. వారి రూపములను, గుణములను చూస్తూ ఉంటే మనకు భేదం కలుగుతుంది. భేద దృష్టి ఉన్నవాడు మరణిస్తూ ఉంటాడు తిరిగి పుడుతూ ఉంటాడు. భేదం చూడటం మానకపోతే నీవు పూజచేసినా, జపంచేసినా, ధ్యానంచేసినా, విచారణ చేసినా నీ యోగం భంగపడుతుంది అంటున్నారు భగవాన్.

నదియొక్క ఈవలిగట్టునుండి ఆవలిగట్టుకు వెళ్ళటానికి వంతెనగాని, పడవగాని ఉండాలి. అలాగే అజ్ఞానము అనే ఈవలిగట్టు నుండి, జ్ఞానము అనే ఆవలి గట్టుకు వెళ్ళటానికి వంతెనలాగ, పడవలాగ సహాయపడేవాడే గురువు. మృత్యుస్థితినుండి అమృతస్థితికి తీసుకొని వెళ్ళేవాడే గురువు. నీవు ఆత్మానుభవంపొందేవరకూనిన్ను విడిచిపెట్టడు. నిన్ను వెంటాడుతాడు.

భేదదృష్టి గ్రహిస్తూ ఉంటే మృత్యువాత పడతావు. మరల జన్మవస్తుంది. అందువలన చూపు మారాలి. ఇతరులను చూసేటప్పుడు రూపం, గుణం చూడవద్దు. అందరిలోనూ ఒకడు ఉన్నాడు. వాడు ఆత్మగా ఉన్నాడు, సమానంగా ఉన్నాడు, వాడు ఏమీ అనుకోడు వాడిని చూడటం నేర్చుకో. అప్పుడు భేద బుద్ధినశిస్తుంది. మృత్యువు నుండి అమృతస్థితిని పొందుతావు. అందువలన చూడటం నేర్చుకో అంటే ఇంతవరకూ మనకు చూడటంకూడా చేతనవ్వలేదు. రంగులు అన్నీ శవాలకే. గుణాలు అన్నీ జీవులకే. వీటిని చూస్తే భేదం గ్రహిస్తావు.

లోపల ఉన్నవాడిని చూడటం నేర్చుకో. వాడిలో భేదం లేదు. వాడిని చూడటం నేర్చుకుంటే, భేదం లేనివాడిని పట్టుకుంటే భేదం లేనిస్థితికి ఎదిగి వెళ్ళిపోతావు. అప్పుడు అమృతస్థితి వచ్చి నిన్ను వరిస్తుంది. అందువలన చూడటం నేర్చుకో. మన అలవాట్లు చాలా బలీయమైనవి. నీ మనస్సును హృదయంలో నిలబెట్టి ఉంచగలిగితే నీ అలవాట్లను జయించగలవు. అది ఒక జ్ఞాన కేంద్రము. Direct గా ఆత్మతో అనుబంధము లేకపోతే ఏదో ఒక దేవతారూపమును ఆరాధించు. దేవుడు అనే వాడు ఒకటిగానే ఉన్నాడు. మన బుద్ధులు శవాలకు సంబంధించిన బుద్ధులు. దేహమునకు పరిమితమై ఉంటాయి. అందువలన ఉన్నవస్తువుకు ఒక దేవతారూపమును కల్పించి దాని మీద మనబుద్ధిని నిలబెట్టి ధ్యానం చేస్తున్నాము. రూపం కల్పించటం ఉపాసన కోసం. మనం నామమునకు, రూపమునకు అలవాటుపడి ఉన్నాము. అంతటా ఉన్న వస్తువుకు నామము, రూపంలేదు. Direct గా దానిని అనుభవంలోనికి తెచ్చుకో లేకపోతున్నాము. అందువలన దానికే దేవతారూపమును కల్పించాము. మీకు రాముడు అంటే ఇష్టం అనుకోండి. మీ పేరు కంటే రాముడు పేరు అంటే ఎక్కువ ఇష్టపడుతున్నారా అని చూసుకోండి. మీ రూపము కంటే రాముడు రూపము అంటే ఎక్కువ ఇష్టపడుతున్నారా అని చూసుకోండి. మీకు నిజం తెలియదు. కాని మీరు పూజించే దేవునికి నిజంతెలుసు. అక్కడికి తీసుకొనివెళ్ళేవరకూ ఆయన మిమ్మలను విడిచిపెట్టడు.

అంతటా వ్యాపించి ఉన్న చైతన్యమును మీరు Direct గా పట్టుకోలేరు. అది ఉందో లేదో అనే అనుమానం రావచ్చును. కాని నేను అనేది ఉంది. నేను ఉందా, లేదా అనే అనుమానం నీకు లేదు. ఈ నేనును పట్టుకుంటే దాని మూలంలోనే ఉందో లేదో అనుకొనేది ఉంది. నేనును పట్టుకుంటే అది తెలుస్తుంది. లోపల ఉన్న వస్తువు అనుభవంలోనికి వచ్చినపుడు అంతటా వ్యాపించి ఉన్న వస్తువుకు దీనికి ఏమీతేడాలేదు, అదే ఇది, ఇదే అది అని నీకు తెలుస్తుంది. ఆవస్తువుకు చావులేదు అందువలన నీవు చావులేనివాడవు అవుతావు. అది అంతటా ఉంది. అందువలన నీవు కూడా అంతటా ఉంటావు ఆవస్తువు శాంతిగా ఉంది. అందువలన నీవు కూడా శాంతిగా ఉంటావు. ఆవస్తువు ధనవంతులకుగాని, విధ్యావంతులకు గాని తెలియబడదు. అది ఎవరికి తెలియబడాలి అని అనుకొందో వారికి తెలియబడుతుంది. మన అందరకు దానిని తెలుసుకోవాలని ఉంది. కాని వీరికి తెలియబడాలి అని అది అనుకోవాలి.

ఆత్మజ్ఞానం మాట అటుఉంచండి. మనకు ఉన్న సభ్యత, సంస్కారము, వినయం సరిపోదు. మన మొఖాలలో ఇంకా అవినయం ఉంది. అసలు వినయంలేదు అని కాదు మనకు ఉన్న వినయం యొక్క మోతాదు సరిపోదు.

మనం ఆత్మశాశ్వతం అనుకోవటంలేదు, దేహం శాశ్వతం అనుకొంటున్నాము. దేహం శాశ్వతం అనుకొన్నంతకాలము నీవు విచారణకు అర్హుడవు కావు. ఇంద్రియ విషయముల పట్ల వైరాగ్యము, దేహం యందు అశాశ్వత బుద్ధివస్తే ఆత్మాన్వేషణకు అర్హుడవవుతావు. నేను ఎవడను? అనే విచారణకు అర్హుడవు అవుతావు.

కొంతమంది మనుషులకు మహిమలు అంటే ఇష్టం. వినాయకుడి బొమ్మపాలు త్రాగుతోంది అని చెపుతున్నారు. అది త్రాగితే ఏముంది? త్రాగకపోతే ఏముంది? దానిగురించి మన బుర్రపాడుచేసుకోవటం తప్పు. సాధారణంగా మానవులలో వెర్రితనం ఎక్కువ ఉంటుంది, ఆలోచన తక్కువ ఉంటుంది. నిజంగా వినాయకుడు పాలుత్రాగితే మీకు జ్ఞానం వస్తుందా? జ్ఞానం లేకపోతే మోక్షం లేదు. ఆత్మను తెలుసుకోవటం

అంటే ఆత్మగా ఉండటం. మనం దేహంగా ఉంటున్నాము. ఇప్పుడు మనకు దేహము ప్రత్యక్ష అనుభవంలో ఉంది. అలాగే లోపల ఉన్న సత్య వస్తువు నీకు ప్రత్యక్షముగా అనుభవంలోనికి రావాలి. అది ప్రత్యక్షముగా అనుభవంలోనికి రాదు అనుకో నీవు ఏదైనా ఊహించవచ్చు, ఏదైనా నమ్మవచ్చు. నీవు నిజాన్ని నమ్మాలిగాని నీవు నమ్మినది నిజంకాదు. లోపల ఉన్నసత్యవస్తువు కామరహితునకు, ఆత్మవిద్యాసంపన్నుడికి అనుభవంలోనికి వస్తుంది. దేహం మరణించటానికి దీనికి ఏవిధమైన సంబంధములేదు. దేహం ప్రారబ్ధమును అనుభవించటానికి వచ్చింది. అది భూమి మీద ఏ అనుభవాలు పొందాలో అవి పొందేవరకూ తిరుగుతుంది. ఎంతకాలము తిరగాలో అంతకాలము తిరుగుతుంది. తరువాత పడిపోతుంది.

రెండు ఉంటే భయం, కక్ష, కామం, వికారం వస్తాయి. ఉన్నది ఒకటే అయితే ఏమీ లేదు. ఉన్నది ఒక్కటే. అదే బ్రహ్మము. అది అనుభవంలోనికి వచ్చేవరకూ వికారములు నిన్ను విడిచిపెట్టవు.

మనకు ద్వైతమూ అవసరమే, విశిష్టాద్వైతమూ అవసరమే, అద్వైతమూ అవసరమే. ఆచార్యులను అందరనూ మనం గౌరవించవలసిందే. వారివారి చైతన్య స్థాయినిబట్టి ఒకో మార్గము చేత ఆకర్షించబడతారు.

ఉన్నది ఒకటే వస్తువు. దానికి పుట్టుకలేదు, చావులేదు. ఒకచోట ఉండి ఇంకోచోట లేకపోవటం అంటూలేదు. అన్ని కాలములలోనూ ఉంది. అది నువ్వే. దానికి పుట్టుకలేదు. మరిపుట్టినవాడు ఎవరు? ఇది అర్థమయితే జ్ఞానం కలుగుతుంది. ఇది అర్థమవ్వకపోతే అజ్ఞానము. పుట్టినవాడు చనిపోతాడు. నీకు ఎందుకు. నీవు పుట్టలేదు కదా అనేవారు భగవాన్. భగవాన్‌ది అజాతవాదము.

బాహ్యవిషయములలో దేనిపై ఆకర్షణ కలిగినప్పటికి అక్కడ వ్యక్తి భావన ఉంది అని గుర్తు. ఎవరైనా ఏదైనా మాట అంటే మీరు భరించలేకపోతే అక్కడ వ్యక్తి భావన ఉంది అని అర్థము.

మనం అందరము ఇక్కడ ఉన్నాము. ఉన్నాము అని ఎలాతెలుస్తుంది. నీ ఇంద్రియాలకు ఉన్న విషయాలమూలంగా, మనస్సుకు ఉన్న ఆలోచనల కారణంగా నీవు ఉన్నావన్న సంగతి తెలుస్తుంది. గాఢ నిద్రలో మనం ఉన్నాము అన్న సంగతి మనకు తెలియటంలేదు. ఎందుచేతనంటే అక్కడ ఇంద్రియాలగొడవ, మనస్సుగొడవలేదు. ఇంద్రియాలగొడవ, మనస్సు గొడవ లేకుండా నీవు ఉండగలవు ఎందుచేత నంటే గాఢనిద్రలో వీటి గొడవ లేకుండా నీవు ఉంటున్నావు.

ఇప్పుడు నీవు అహంకారములో స్థిరపడ్డావు. అలాగే నీవు ఆత్మలో స్థిరపడేవరకూ ప్రకృతి నిన్ను వెంటాడుతుంది. నీవు ఆత్మగా ఉండే రోజువచ్చేవరకూ నిన్ను దుఃఖము వెంటాడుతుంది. నీ కర్మ నిన్ను వెంటాడుతుంది, సందేహాలు వస్తూ ఉంటాయి.

నీవు చేసేపూజలు, జపాలు, ధ్యానాలు Fan గాలి లాంటివి. కాని సత్పురుషుల సహవాసం సహజమైన గాలి లాంటిది. దేవతా విగ్రహాల ఆరాధన కంటే సత్పురుషుల సహవాసం వలన నీవు ఎక్కువ పుణ్యంను పొందుతావు నీవు పుణ్యంను కోరుకొంటే. పుణ్యఫలం late అవుతుంది. వ్యక్తి భావనతో చేసే పుణ్యం వలన కూడా ఫలితం వస్తుంది. పుణ్యఫలం ఎప్పుడో ఎక్కడో వస్తుంది. కాని జ్ఞాన ఫలం అలాకాదు. జ్ఞానఫలం immediate ఇప్పుడే ఇక్కడే వచ్చేస్తుంది. పుణ్యఫలమునకు వాయిదాలు ఉన్నాయి. జ్ఞానఫలమునకు

వాయిదాలు లేవు. పుణ్యఫలము అనుభవిస్తే పోతుంది. అలా పోతే ఏ గొడవ లేదు అలాచేయదు మనం పుణ్య ఫలం ద్వారా ఏసుఖాన్ని అయితే అనుభవించామో ఆసుఖం వైపుకు మనస్సును త్రిప్పుతుంది గాని మన మొఖాన్ని జ్ఞానంవైపుకు తిరగనివ్వదు.

మెదడును ఆలోచించమంటే ఆలోచించదు. అనుకరణచేయమంటే చేస్తుంది. ఆలోచించటానికే మెదడును ఇచ్చాడు కదా ఆలోచించండి. నీకు తెలివిఉంది అనుకో దానిని నీ హృదయంలో ఉన్న నిజాన్ని తెలుసుకోవటానికి ఉపయోగించుకోకపోతే ఆ తెలివిని ఏమిచేసుకొంటావు అన్నారు భగవాన్.

జ్ఞాని లోకాన్ని చూస్తున్నాడు. మనము లోకాన్ని చూస్తున్నాము. మనం బ్రహ్మంను లోకంగా చూస్తున్నాము కాని జ్ఞాని లోకాన్ని బ్రహ్మముగా చూస్తున్నాడు. రూపములు చూసినా, గుణాలు చూసినా అనేకత్వంలో ఏకత్వమును చూస్తున్నాడు. అందువలన ఆయనది అభయస్థితి. మనది భయస్థితి. తాను దేహమును కాదు, మనస్సును కాదు అని జ్ఞానికి తెలుసు.

అనుకొనేది జీవుడి సంకల్పము. జరిగేది ఈశ్వర సంకల్పము. మనకూ దేవునికీ రాజీ కుదరటంలేదు. ఆయన సంకల్పం కంటే మన సంకల్పము అంటేనే మనకు ఎక్కువ ఇష్టం. శరణాగతి పొందినవాడు నీ ఇష్టమే నాయిష్టం, నీ సంకల్పమే నా సంకల్పము అని అంటాడు. ఆయన ఇష్టమే మన ఇష్టం అయినపుడు జీవలక్షణాలు నశిస్తాయి. జీవలక్షణాలు నశిస్తే నీవు పోతావు అని అనుకోవద్దు. నీవు nothing అయిపోవు. వస్తువు బంగారము నుండి పుట్టింది. వస్తువుగా ఉన్నప్పుడు కూడా అది బంగారమే. వస్తువును చెడగొట్టినపుడు వస్తువు యొక్క రూపము పోయిన వెంటనే అది బంగారములాగ మిగులుతుంది. అలాగే జీవలక్షణాలు పోయిన వెంటనే నీవు బ్రహ్మము అయిపోతావు. మీరు పెద్దపెద్ద పూజలు చేయలేకపోయినా, వేదములు చదవలేకపోయినా మీ అహంకారమును చూడండి, తీక్షణంగా చూడండి, లోతుగా చూడండి. మీరు నన్ను ఎలా చూస్తున్నారో, నేను మిమ్మలను ఎలా చూస్తున్నానో అలాగ మీ అహంకారమును చూడండి. దానిని పరిశీలించండి. దాని విజృంభణ ఎలా ఉందో చూడండి. దానితో పేచీ పెట్టుకోవద్దు. దానితో పేచీ పెట్టుకుంటే మీరు ఓడిపోతారు. దానిని చూడండి. అలా చూడటంవలన అహంకారము పలచబడుతుంది.

అహంకారమును పోగొట్టుకోవటానికి నీవు సిద్ధంగాలేవు. ఎందుచేతనంటే అహంకారమే నీవు అనుకొంటున్నావు. అది పోతే నేను పోతాను అనుకొంటున్నావు. అహంకారము పోతే నీవు పోవు. నీవు ఎవరివో నీకు తెలుస్తుంది.

సత్యవస్తువు మీకు అనుభవంలో లేకపోయినా, సత్యవస్తువు అనుభవంలో ఉన్నవాడిని చూస్తూ ఉంటే సృష్టిలో ఎన్ని అందాలు ఉన్నాయో అవి అన్నీ తాత్కాలికంగా వచ్చి నిన్నువరిస్తాయి. దేహమును ప్రారబ్ధమునకు విడిచిపెట్టండి. దేహముతో తాదాప్యము పొందటం మానివెయ్యండి. నీ సాధన యొక్క ప్రయోజనం అదే. నీదేహమునకు సంబంధించినంత వరకూ ప్రతీదీ నిర్ణయించబడి ఉంటుంది. ఈరోజు మీరు అందరూ వచ్చి ఇక్కడ కూర్చోవటం కూడా మీ తల్లి కడుపులో నుండి వచ్చినపుడే నిర్ణయించబడి ఉంటుంది. Every thing is planned. నీవు చేసే జపాలు, ధ్యానాల వలన ప్రయోజనం ఏమిటి అంటే దేహంతో తాదాప్యం పొందకుండా ఉండటమే. నీ సాధనాబలం వలన దేహంతో తాదాప్యం పోతుంది. దేహం ఎంతవరకూ తిరగాలో తిరిగి పడిపోతుంది. నీకు సంతోషంవచ్చినా, దుఃఖము వచ్చినా నిజం అనుకోవద్దు. నీ

పుణ్యఫలము సుఖం రూపంలోనూ, నీ పాపఫలము దుఃఖం రూపములోనూ నీకు అనుభవంలోనికి వచ్చాక బయటకు పోతుంది. నీకు వాటితో తాదాప్యం లేనపుడు నీకు సంతోషము వచ్చినా సంతోషములాగ కనబడదు, దుఃఖము వచ్చినా దుఃఖము లాగ కనబడదు. ఇవి అన్నీ మనస్సు యొక్క వికారములు.

సాధనలో పురోభివృద్ధి రావాలంటే నిన్నటి గొడవలు నేటి మీద ఉండకూడదు, నిన్నటి గొడవలు నేటి మీద ఉంటే దేహగతమైన నేను పెరుగుతూ ఉంటుంది. నీ ఆలోచనలలోగాని, చేతలలోగానీ, మాటలలోగాని దేహగతమైన నేనును పెరగ నివ్వవద్దు. ఏ సంఘటన జరిగినా జరగలేదు అనుకో ముందుకు వెళ్ళిపోతావు అన్నారు భగవాన్.

రామాయణం, భారతం నిజంగా జరిగాయా అని భగవాన్‌ను అడిగితే జరగకపోతే గొడవేలేదు, ఒకవేళ జరిగినా నిజంకాదు. అది వ్యవహారిక సత్యం మాత్రమే. పారమార్థిక సత్యంకాదు. ఇది చెప్పటానికి ఎంతధైర్యము ఉండాలో చూడండి. దీనిని బట్టి ఆయన ఏస్థితిలో ఉన్నాడో గమనించవచ్చు. నీ దేహం ఎంతనిజమో, ఈ లోకం ఎంత నిజమో రామాయణం, భారతం కూడా అంతేనిజము. అలాగని రామాయణం మీద భారతం మీద గౌరవంలేదు అనికాదు. అది వ్యవహారిక సత్యము. ఆధ్యాత్మిక సత్యం కాదు. final truth కాదు.

కర్మలో అకర్మను చూసేవాడు బుద్ధి మంతుడు అని కృష్ణుడు గీతలో చెప్పాడు. జ్ఞానికే బుద్ధిమంతుడు అని పేరు పెట్టాడు. కర్మలో అకర్మను చూసేవాడు కర్మచేసినా చేయని వాడితో సమానము. అకర్మ అంటే బ్రహ్మమే. కర్తృత్వ బుద్ధి లేనివాడు పనిచేసినా చేయనివాడితో సమానము.

బాహ్యమైన విషయములు చూడటానికి సూర్యుడు కాంతిని ఇస్తున్నాడు. సూర్యకాంతి సహాయముతో బాహ్యమైన వస్తువులను చూస్తున్నాము. మన మనస్సులో ఉన్న విషయములను కూడా చూస్తున్నాము. దానికి వెలుతురు ఎక్కడ నుండి వస్తోంది? సూర్యుడు యొక్క వెలుగు అక్కడకు పోదు. నీ మనస్సులో ఉన్న విషయములను చూడటానికి నీహృదయంలో ఉన్న ఈశ్వరుడు వెలుతురును ఇస్తున్నాడు. ఆయన ఇచ్చే వెలుతురు సహాయంతో మనస్సులోని గొడవలను చూస్తూ ఆయనేలేడు అంటున్నావు.

మనకు మనస్సు నేనుగా వ్యక్తమవుతోంది. నీవు ఎవరవు అని మనస్సును ప్రశ్నించటం వలన మనస్సుకు నిగ్రహం కలుగుతుంది. ఎప్పుడైతే మనస్సుకు నిగ్రహం కలిగిందో అది ఆత్మాభిముఖంగా, హృదయాభిముఖంగా ప్రయాణం చేస్తుంది. మేము ఆత్మ విచారణ చేయము అని భగవాన్‌తో అంటే చేయకపోతే మానివేయండి లోకవిచారణ మొదలవుతుంది అన్నారు భగవాన్. ఏదో ఒక విచారణ తప్పదు ఎందుకంటే మనస్సు అక్కడ ఉంది. నీవు ఆత్మ విచారణ మానివేసిన మరుక్షణంలో లోకవిచారణ వస్తుంది అన్నారు భగవాన్. భగవాన్ బ్రతిమాలినట్లుగా ఎవరితోనూ చెప్పరు. వస్తువు చేతిలో ఉంది. ఆయనకు భయం ఏమిటి? ఉపనిషత్తులలో అలా ఉంది, ఇలా ఉంది అని భగవాన్ చెప్పరు . ఆయన అనుభవంలో నుండి తీసిఇవ్వటమే. నీవు ఎంతనిజమో దేవుడు కూడా అంతేనిజం అనిచెప్పారు. నీకు నేను గావ్యక్తమయ్యే మనస్సు ఎంత నిజమో లోకాలు కూడా అంతేనిజం. మనస్సులేకపోతే లోకాలు ఎక్కడ ఉన్నాయి. ఏదో వ్రతాలు చేయటం వలన మాత్రమే పుణ్యం వస్తుంది అని అనుకోవద్దు. నీవు ఎవడివో నీవు తెలుసుకొనే ప్రయత్నంలో కూడా పుణ్యం వస్తుంది నీవు కావాలని అనుకొంటే.

కొంతమంది మహిమలు, సిద్ధులు చూపిస్తూ ఉంటారు. స్వప్నంలో వచ్చిన విషయాలు ఎంతనిజమో ఇవి కూడా అంతేనిజము. స్వప్నంలోవచ్చిన విషయాలు మెలుకువ వచ్చాక నిజంకాదు అని తెలుస్తుంది. అలాగే ఆత్మానుభవం కలిగిన వెంటనే మహిమలు, సిద్ధులు ఇవి అన్నీ నిజంకాదు అని తెలుస్తుంది. మనస్సును ఇటువంటి చిల్లరగొడవల మీదకు వెళ్ళనిచ్చే వారు కాదు భగవాన్. ఏ వస్తువు అనుభవంలోనికిరావటంవలన దుఃఖము లేని స్థితికి ఎదిగి వెళ్ళిపోతామో ఆస్థితికి తీసుకొనిపోవటానికే ఆయన ప్రయత్నంగాని చిల్లర గొడవలు ఏమీ అక్కరలేదు. మహిమలదగ్గర ఆగిపోవటంకాదు.

నీ మాటలు గాని, చేతలుగాని నీకున్న అజ్ఞానము నశించటానికి సహకరించాలి. గర్వంలేనిచదువు, గర్వం లేని ధనము ఆత్మాన్వేషణకు సహకరిస్తాయి. అణిగిన మనస్సుకు గాని ఆత్మానుభవంరాదు. మనస్సు అణగాలి. రజోగుణం, తమోగుణం ఉన్నవాడి మనస్సు అణగదు. సత్వగుణమును అలవాటు చేసుకోవాలి. మనస్సు యొక్క తూకం పెరగాలి. వైరాగ్యం వలన మనస్సు యొక్క తూకం పెరుగుతుంది.

నీవు నిజాన్ని తెలుసుకొని తీరాలి. ఎందుకు తెలుసు కోవాలి అంటే ఇది ఒక్కటి మాత్రమే స్వేచ్ఛను కలుగజేస్తుంది. నిజాన్ని తెలుసుకోకపోతే నీకు సుఖంలేదు. నీ లోపం ఉన్న సత్యం అనుభవంలోనికి వచ్చే వరకూ నిన్ను అజ్ఞానము నుండి ఎవరూ విడదీయలేరు. నిన్ను అజ్ఞానము నుండి విడుదల చేసేవాడు ఎక్కడో బయటలేడు. వాడు నీ హృదయంలోనే ఉన్నాడు. ఆత్మగా ఉన్నాడు.

దేహము, మనస్సు నాకు అనుభవంలో ఉన్నాయి. చైతన్యం నాకు అనుభవంలో లేదు. చైతన్యమును అనుభవంలోనికి తెచ్చుకోవటానికి దేహము, మనస్సు ఉపయోగపడతాయా అని భగవాన్‌ను అడిగితే చైతన్యమును అనుభవంలోనికి తెచ్చుకోవటానికి నీ దేహమును, మనస్సును ఎంతవరకూ ఉపయోగించుకొంటావో, అంతవరకే వాటి ఉపయోగం మిగతాది ఉపయోగం కాదు. బాహ్యంగా నీకు ఎన్ని సదుపాయములు ఉన్నా వాటిని చైతన్యం అనుభవంలోనికితెచ్చుకోవటానికి ఉపయోగించుకోవాలి. లేనిచో వాటి ప్రయోజనం ఏమీలేదు. మనం చనిపోతే నిద్రలోనికి వెళతాము. మరల పుట్టటం అంటే స్వప్నంలోనికి వెళతాము. అక్కడ కొంతకాలము ఉంటాము మరల నిద్రలోనికి వెళతాము. అప్పుడు మరల స్వప్నంలోనికి వస్తాము. ఇలా నిద్ర, స్వప్నములలో ఉంటున్నాము. మనకు ఇదే పని తప్ప నిజం గొడవలేదు. ఎవరో మహాగురువు కలగజేసుకోవటం వలన నీ కళ్ళు తెరవబడి నిజం వైపుకు చూస్తావు గాని అది నీవల్ల అవ్వదు.

సత్యాన్వేషకుడు ఎలా ఉండాలంటే తెలుసుకుంటే సత్యమును తెలుసుకోవాలి లేకపోతే శరీరమును విడిచి పెట్టేయాలి.

రాగద్వేషములు, కామ క్రోధములు ఇవి అన్నీ బలిసిపోయిన పశువులు లాగ ఉన్నాయి. పరమేశ్వరుడు మహాశక్తితో ఈ పశువులను పడగొట్టాలి గాని నీ సాధన ఎంత? నీ తెలివితేటలు ఎంత?

*(జిన్నూరులో శ్రీ నాన్నగారి ప్రసంగము 30-10-95)*